నమస్తే తెలంగాణ
నిజామాబాద్, ఆదివారం 2 మార్చి 2025
SUNDAY, MARCH 2, 2025

ఆదర్శ పాఠశాల తనిఖీ

ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మాలతి

ధర్పల్లి, మార్చి 1 : మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలను తహసీల్దార్ మాలతి శనివారం తనిఖీ చేశారు. వంట శాలను పరిశీలించి, పరిశుభ్రత పాటించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆమె వెంట ఆర్ఐ రాజేశ్వర్, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం ఈనెల 5 నుంచి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షల నేపథ్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.

వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ల ఏర్పాటు

వీసీబీలను ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

రుద్రూర్, మార్చి 1 : వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా మండలంలోని అక్బర్‌నగర్ సబ్‌స్టేషన్‌లో 11 కేవీ ఫీడర్లకు వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్లను సంబంధిత అధికారులు శనివారం ఏర్పాటు చేశారు. గతంలో అక్బర్‌నగర్, బొప్పాపూర్ 11కేవీ ఫీడర్లకు ఒకే వీసీబీ ఉండేదని, దీంతో విద్యుత్ అంతరాయం ఎక్కువగా జరిగేదని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం వీసీబీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విగ్రహాలు, డీజేల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

- ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశం

వినాయక్‌నగర్, మార్చి 1 : నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విగ్రహాలు, డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 55 డెసిబుల్స్ సౌండ్ మాత్రమే వాడాలని, రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజే సౌండ్ సిస్టం పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. 500 కన్నా ఎక్కువ మందితో కార్యక్రమాలు నిర్వహించే వారు 72 గంటల ముందుగా సీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నిబంధనలు మార్చి 15 వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

'సదరం' దరఖాస్తుదారులకు సౌకర్యాలు కల్పించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్/ కంఠేశ్వర్, మార్చి 1: వైకల్యం నిర్ధారణ సర్టిఫికెట్ల కోసం నిర్వహించే సదరం క్యాంపునకు వచ్చేవారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ సూచించారు. సదరం సేవలను సులభతరం చేస్తూ ఇటీవలే కొత్తగా యూనిక్ డిసెబిలిటీ ఐడీ (యూడీఐడీ) పోర్టల్‌ను ప్రవేశపెట్టిన నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లు, డీఆర్డీవోలు, డీడబ్ల్యూవోలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఇకనుంచి యూడీఐడీ పోర్టల్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నేరుగా లేదా మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారికి సదరం క్యాంప్‌నకు ఎప్పుడు, ఎక్కడ హాజరుకావాలో మెస్సేజ్ వస్తుందని పేర్కొన్నారు. అంగవైకల్యానికి సంబంధించి ఈ పోర్టల్‌లో 21 రకాల కేటగిరీలు చేర్చారన్నారు. ఈ పోర్టల్ వినియోగంపై మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. వైకల్య నిర్ధారణ జరిగిన తర్వాత స్మార్ట్ కార్డు రూపంలో సర్టిఫికెట్లను దరఖాస్తుదారులకు పోస్టల్ ద్వారా ఇంటి అడ్రస్‌కు పంపిస్తారన్నారు. సదరం క్యాంప్‌లకు వచ్చేవారికి తాగునీరు, టాయిలెట్స్, కుర్చీలు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీవో సాయాగౌడ్, డీసీహెచ్ఎస్ శ్రీనివాస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీయూ మైనార్టీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవి

డిచ్‌పల్లి, మార్చి 1 : టీయూ మైనార్టీ సెల్ డైరెక్టర్‌గా డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖవిని నియమిస్తూ వీసీ ప్రొఫెసర్ యాదగిరి రావు శనివారం నియామక ఉత్తర్వులు అంజేశారు. మహ్మద్ అబ్దుల్ ఖవి పదేండ్లుగా ఉర్దూ డిపార్ట్‌మెంట్‌లో సేవలందిస్తున్నారు. గతంలో ఉర్దూ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, బీవోఎస్ చైర్మన్‌గా, పీఆర్వో (డైరెక్టర్)గా, చీఫ్ వార్డెన్‌గా, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్‌గా, ఎగ్జామ్ బ్రాంచ్ అడిషనల్ కంట్రోలర్ తదితర విధులు నిర్వర్తించారు.

చిరుతతో అప్రమత్తంగా ఉండాలి

- అడవి పరిధిలోని పాకల్లో పశువులను కట్టేయవద్దు
- ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్

సారంగాపూర్, మార్చి 1 : మండలంలోని మల్కాపూర్ తండా గ్రామశివారు ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి సంజయ్‌గౌడ్ సూచించారు. మల్కాపూర్ తండా శివారులో నాలుగురోజుల క్రితం చిరుత దాడిలో దూడ మృతిచెందిందని, ఘటనా స్థలంలో చిరుత ఆనవాళ్లు కనిపించాలని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను ఇంటి వద్దే కట్టి ఉంచాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కోటగిరి, మార్చి 1 : మండలకేంద్రంలోని మాలివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు హాజరు పట్టికలను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం శానం సాయిలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రుద్రూర్ ఎంపీడీవోగా భీమ్‌రావు

భీమ్‌రావును సన్మానిస్తున్న కార్యదర్శులు, సిబ్బంది

రుద్రూర్, మార్చి 1 : రుద్రూర్ ఎంపీడీవోగా భీమ్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీవోగా పనిచేసిన సురేశ్‌బాబు శుక్రవారం ఉద్యోగ విరమణ చేయగా.. ఆయన స్థానంలో భీమ్‌రావు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు రిటైర్డ్ ఎంపీడీవో సురేశ్‌బాబుతో పాటు కార్యదర్శులు, సిబ్బంది సన్మానించి, స్వాగతం పలికారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రుద్రూర్, మార్చి 1 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీలను మండల నాయకులు శనివారం ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అధికారం దక్కించుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం, వ్యతిరేకత ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు, నీరడి సాయిలు, హరీశ్, మెహరాజ్, సంతోష్, సాయిలు, ప్రవీణ్ పాల్గొన్నారు.

గుంతలను పూడ్చండి సారూ..

భీమ్‌గల్, మార్చి 1: పట్టణంలోని హనుమాన్ ఆలయం వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చాలంటూ అంగడిబజార్ వాసులు కోరుతున్నారు. కొంతకాలం క్రితం ఆలయం ఎదుట రోడ్డుపై కల్వర్టుకు గుంతలు ఏర్పడ్డాయి. గంతలను తప్పించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళలో ఈ రోడ్డు గుండా నడిచేందుకు ప్రజలు జంకుతున్నారు. కల్వర్టుకు మరమ్మతు చేసి గుంతలు పూడ్చివేయాలని మున్సిపల్ సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

భీమ్‌గల్‌లోని అంగడిబజార్ హనుమాన్ ఆలయం వద్ద ఏర్పడిన గుంతలు

'ఎస్సీ వర్గీకరణ' అమరులకు నివాళి

కోటగిరిలో అమరవీరుల ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా వద్ద..

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మార్చి 1 : ఎస్సీ వర్గీకరణ కోసం 16 ఏండ్ల క్రితం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ముట్టడిలో అమరులైన 11 మందికి జిల్లాకేంద్రంతో పాటు వివిధ మండలాలు, గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు.

జిల్లాకేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా, కోటగిరి బస్టాండ్, డిచ్‌పల్లిలోని అంబేద్కర్ విగ్రహం, జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ, చందూర్ మండల కేంద్రం, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం, మోర్తాడ్ మండల కేంద్రం, బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం, ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, రెంజల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

ఇందూరు కవులకు సన్మానం

కాసర్ల నరేశ్‌రావును సన్మానిస్తున్న శ్రీ సరస్వతీ కళాపీఠం ప్రతినిధులు

సుభాష్‌నగర్, మార్చి 1 : జిల్లాకు చెందిన ప్రముఖ కవులు గణపతి అశోకశర్మ, గంట్యాల ప్రసాద్, కాసర్ల నరేశ్‌రావు, చింతల శ్రీనివాస్‌గుప్తాను బాసర శ్రీ సరస్వతీ కళాపీఠం ప్రతినిధులు సరస్వతీ పుత్ర బిరుదును శనివారం ప్రదానం చేసి, సన్మానించారు. శ్రీ సరస్వతీ కళాపీఠం కన్వీనర్ రఘు మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో జాతీయస్థాయిలో విశేష కృషి చేస్తున్నందుకు ఈ బిరుదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్, ప్రతాప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ పరమహంస జయంతి

సుభాష్‌నగర్, మార్చి 1 : జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న రామకృష్ణ కుటీరంలో రామకృష్ణ పరమహంస జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. వేద ప్రవచనం, విష్ణు సహస్రనామ పారాయణం, యజ్ఞం తదితర కార్యక్రమాలు కుటీర నిర్వాహకుడు ఎస్ఎస్ చారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఫిష్ మార్కెట్ కోసం స్థల పరిశీలన

డిచ్‌పల్లి, మార్చి 1 : మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఫిష్ మార్కెట్‌కు కేటాయించిన స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం పరిశీలించారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు గంగపుత్ర సంఘం మండల నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, ధర్మాగౌడ్, వాసు, శ్రీనివాస్, నారాయణ, స్వామి, సాగర్, నర్సన్న పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- సాలూర పీహెచ్‌సీ తనిఖీ

వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

బోధన్ రూరల్, మార్చి 1: వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖాలోని వివిధ విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఇన్ పేషెంట్ వార్డును సందర్శించి రోగులను పలకరించి వారికి అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేటా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్ ఉన్నారు.

చివరి ఆయకట్టుకూ నీళ్లు అందిస్తాం

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి, మార్చి1: చివరి ఆయకట్టుకూ నీళ్లు అందిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని డీ–46 కెనాల్‌ను ఇరిగేషన్ అధికారులు, నాయకులతో కలిసి శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. వరి పొట్టదశలో ఉందని, నీటిని విడుదల చేయించాలని డీ–46 కెనాల్ ఆయకట్టు రైతులు ఎమ్మెల్యేను కోరగా స్పందించిన ఆయన ఇరిగేషన్ ఈఈ బలరాం, డీఈ లోక్యానాయక్‌ను పిలిపించి మాట్లాడారు. అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్ కింద సుమారు 53 వేల ఎకరాల భూమి సాగులో ఉన్నదని, చివరి ఆయకట్టు వరకూ డీ–46 కెనాల్ ద్వారా ఈనెల 4వ తేదీ నుంచి నీటిని విడదల చేస్తామని ఈఈ బలరాం తెలిపారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కాంగ్రెస్ నాయకులు గంగాధర్, ఎల్లయ్య యాదవ్, ఈరటి లింగం, సత్యనారాయణ, బంజ కామప్ప, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోపాల్, రైతులు ఉన్నారు.

పాఠశాలలో సైన్స్‌ఫెయిర్



విద్యార్థులు తయారు చేసిన బ్రహ్మోస్ క్షిపణిని పరిశీలిస్తున్న ఎంఈవో

మాక్లూర్, మార్చి1: మండలంలోని గుత్పలోని సీపీఆర్ఎంఎస్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శనివారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈవో నరేందర్ ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన ప్రయోగశాలలను పరిశీలించారు. ఆయన కరస్పాండెంట్ నిత్యానదం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి



ఈజీఎస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న రెంజల్ ఎంపీడీవో

రెంజల్ (శక్కర్‌నగర్), మార్చి1: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ పని కల్పించాలని రెంజల్ ఎంపీవో రఫిక్ అహ్మద్ అన్నారు. శనివారం రెంజల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీల సంఖ్యను పెంచి అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని, ఈనెలా ఖరునాటికి వందశాతం పన్నులు వసూలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో రమణ, కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు

విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాల్కొండ, మార్చి 1: జాతీయ అంధత్వ నివారణ పథకం, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి గ్రామానికి వెళ్లి బాలబాలికలకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో బృందంలో ఇద్దరు వైద్యులు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎం ఉన్నారు. దృష్టిలోపం ఆధారంగా కళ్లద్దాలను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యుడు గురురాజ్, మెడికల్ ఆఫీసర్ సూర్యనారాయణ, ఏఎన్ఎం స్వరూపరాణి, ఎస్‌వో భవాని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ బోరు మోటర్లను కొందరు ఇండ్లకు వాడుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ బోర్ల నుంచి వచ్చే నీరు అందరికీ అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం

శక్కర్‌నగర్, మార్చి 1: బోధన్ పట్టణంలోని కుమ్మర్‌గల్లీలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ రేకులషెడ్డు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. మామిడి పెద్ద ఒడ్డెమ్మ అనే మహిళ రేకుల షెడ్డులో నివాసం ఉంటున్నది. ఆమె గతనెల 27న కోటగిరిలోని తన బంధువుల ఇంటికి వెళ్లింది. శనివారం ఉదయం 11.30 గంటలకు ఆమె చిన్న కుమారుడు సుభాష్ ఆమెకు ఫోన్ చేసి షెడ్డులో కాలిపోయందని చెప్పాడు. ఆమె వచ్చి చూసే సరికి మొత్తం కాలిపోయి కనిపించింది. షెడ్డులో సుమారు నాలుగు తులాల బంగారం, రూ.1.5 లక్షల నగదు కాలిపోయినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



నాగాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, మార్చి 1: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని, వంట చేసేటప్పుడు మరోసారి పాత్రలను శుభ్రపరచాలని సూచించారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

మోర్తాడ్, మార్చి1: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ సూచించారు. నాగాపూర్ గ్రామంలో కొనసాగుతున్న కమ్యూనిటీ టాయిలెట్ల పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా కార్యదర్శి స్వప్నకు పలు సూచనలు చేశారు. పనుల్లో జాప్యం జరగకుండా చూడాలని, వీలైనంత త్వరగా పనులను పూర్తిచేయించాలని చెప్పారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్' కరపత్రాల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి1: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 సిటిజన్ ఫీడ్ బ్యాక్ కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కమిషనర్ రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రజలు తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అందులో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చి ఆర్మూర్ పట్టణాన్ని దేశంలోనే ఉత్తమ పట్టణంగా నిలబెడదామని పట్టణ ప్రజలను కోరారు.

పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్

భీమ్‌గల్, మార్చి 1: పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులపై స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మురికి కాలువల్లో పేరుకపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కమిషనర్ వెంట సిబ్బంది నవీన్, ఓంకార్ తదితరులు ఉన్నారు.ఎల్ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల కమిషనర్ గోపు గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 31వ తేదీ వరకు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆలయ మరమ్మతులకు ఆర్థిక సాయం

భీమ్‌గల్, మార్చి 1: పట్టణంలోని నందీశ్వర గుడి మరమ్మతు పనుల కోసం నందిగల్లికి చెందిన మూత నడ్పి బాలయ్య రూ.పది వేల నగదును ఆలయ కమిటీ సభ్యులకు శనివారం అందజేశారు. ఆయనను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అశోక్, రాజన్న, గంగాధర్, ధర్మపురి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, NARESH THALLALPALLY, S/o. RAJESHAM THALLALPALLY, R/o. H.No. 5-6-245/1, Ngos Colony, Kamareddy, Town & District-503111 T.S., I have changed my name as NARESH TALLAPALLY S/o. RAJESHAM TALLAPALLY
NTZ- 338345

CHANGE OF NAME

★I, RAJESHAM THALLALPALLY, S/o. RAJALINGAM THALLALPALLY, R/o. H.No. 7-72, Ramayampet Mdl, VTC: Dongala Dharmaram, Dist.Medak-502102 T.S., I have changed my name as RAJESHAM TALLAPALLY
NTZ- 338345

CHANGE OF NAME

★I, HEMALATHA THALLALPALLY, W/o. NARESH THALLALPALLY, R/o. H.No. 5-6-245/1, Ngos Colony, Kamareddy, Town & District-503111 T.S., I have changed my name as HEMALATHA TALLAPALLY W/o. NARESH TALLAPALLY
NTZ- 338345

CHANGE OF NAME

★I, BHAGYAMMA THALLALPALLY, W/o. RAJESHAM THALLALPALLY, R/o. H.No. 7-72, Ramayampet Mdl, VTC:Dongala Dharmaram, Dist.Medak-502102 T.S., I have changed my name as BHAGYAMMA TALLAPALLY W/o. RAJESHAM TALLAPALLY
NTZ- 338345

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బోధన్ ఏఎంసీ చైర్మన్ సంధ్యకు టీచర్ ఉద్యోగం

- ఏఎంసీ చైర్ పర్సన్ పదవికి రాజీనామా
- ఉద్యోగంలో చేరిక

అంకు సంధ్య దాము

బోధన్, మార్చి 1: బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంకు సంధ్య దాముకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ఐదు రోజుల క్రితం తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న 2008 డీఎస్సీకి సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 140 మందిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమించింది. ఇందులో ఏఎంసీ చైర్‌పర్సన్ సంధ్య దాము ఒకరు. గత నెల 15న సంధ్యా దాముకు పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చాయి. కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఇటీవల పదవీకాలం ముగిసిన బోధన్ మున్సిపల్ పాలక వర్గంలో కౌన్సిలర్‌గా ఐదేళ్లపాటు కొనసాగారు. అంతకముందు రెండు పర్యాయాలు ఆమె భర్త అంకు దామోదర్ (దాము) మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

భీమ్‌గల్, మార్చి 1: పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కారణాలతో పోగొట్టుకున్న ఏడు సెల్‌ఫోన్లను బాధితులకు సీఐ సత్యనారాయణ శనివారం తన కార్యాలయంలో అందజేశారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల కొందరు వారి సెల్‌ఫోన్లను పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఎడపల్లి, మార్చి1: మండల కేంద్రంలో నూతన ఎంఈవోగా శివలింగ గాలప్ప శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. కుర్నాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహించానని, ప్రస్తుతం ఎడపల్లి ఎంఈవోగా వచ్చానని అన్నారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, సభ్యులు గోవర్దన్, శ్రీనివాసరావు, శ్రీనివాస రెడ్డి, దత్తాద్రి, రవికుమార్, పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు అందజేశారు.